# శిథిల శిల్పాలు

బ్రిటిష్ సామ్రాజ్యపు హయాం మంచి ఉచ్చదశలో ఉంది. సంస్థానాధీశులు సెక్స్, స్పోర్ట్స్‌లో మునిగి తేలుతున్న రోజులు. పెద్దపులి వేటకి వేలకి వేలు ఖర్చయినా లెక్కచెయ్యకుండా రోజుల తరబడి అడవుల్లో కేంపులు వేసి "మృగయావినోదం" లోని రాయల్ థ్రిల్‌ని అనుభవించడం ఆనాటి రాచరికపు ఆనవాయితీ.

రామాపురం ఎస్టేటుకి వైస్రాయిగారు పులివేటకి వస్తున్నట్లు జమీందారు రఘుపతిగారికి వర్తమానం అందింది.

వైస్రాయా, మరొకరా? - వెంటనే హాలెండ్ - హాలెండ్ కంపెనీకి పురమాయించి వైస్రాయిగారి బరువుకి, ఎత్తుకి తగ్గట్టుగా పులివేటకి తగిన తుపాకీని తయారుచేయించి తెప్పించారు.

వైస్రాయిగారు దిగేరు. అంగరక్షకులు, కార్లు; మందీ మార్బలం, గుర్రాలు, వేటకుక్కల అరుపులు! ఒకటేమిటి ఎక్కడ చూసినా 'మృగయా వినోద' కోలాహలం.

ఆ రాత్రి రఘుపతిగారి ప్రయివేటు ఫారెస్టులో వైస్రాయిగారు ప్రత్యేకంగా దిగుమతి చేయబడిన తుపాకీతో ఒకే ఒక దెబ్బతో పెద్దపులిని కిక్కురుమనకుండా కాల్చేశారు. ఆ పులిని చెప్పిన టైముకి, అనుకున్న జాగాకి, వైస్రాయిగారున్న మంచె దగ్గరకు ఠంచనుగా తోలుకొచ్చేరు. వైస్రాయా, మరొకరా! ఠపీమ్మని పిట్టని పేల్చినట్టు పేల్చేశారు.

రఘుపతిగారి షికారీ నిర్వహణాదక్షతని తెగ మెచ్చుకుంటూ వైస్రాయిగారు "రావు బహద్దూర్" అని బిరుదునిచ్చారు.

తుపాకీ మీద వైస్రాయిగారి పేరు, పులిని వేటాడిన తేదీ మొదలైన వివరాలు సంక్షిప్తంగా బంగారంతో చెక్కించి ఆ తుపాకీని జీవితాంతం ప్రాణప్రదంగా చూసుకుంటూ ఒకరోజు రఘుపతిగారు కాలం చేశారు.

రఘుపతిగారి కుమారుడు నరేంద్రవర్మ తండ్రిగారి తుపాకీతో చాలా చాలా పులుల్ని వేటాడి సంస్థానం పేరు నిలబెట్టడమే కాకుండా, ఒకసారి ఎస్టేట్ తగాదాలో అరడజను మంది

తిరుగుబాటుదారుల్ని వెంటాడి, వేటాడి వైస్రాయిగారి తుపాకీతో కాల్చి హతమార్చే శారు. ఆనాటి కోర్టులు ఆ చర్య – ఆస్తిరక్షణ, ఆత్మ సంరక్షణకోసం అలా జనాన్ని చంపడం – న్యాయ సమ్మతమేనని తీర్పు ఇచ్చేయి.

అప్పట్నించీ నరేంద్రవర్మ గారంటే ఆ సంస్థానంలో అందరికీ హడల్. తగవుకి దిగితే తుపాకీ చూపించేవారు. అతనూ చనిపోయారు...

తరువాత బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించింది. సంస్థానాలు, సంస్థానాధీశులు పోయారు. పోయింది పోగా మిగిలిన రామాపురం ఎస్టేటుకి రాజారావు వారసుడయ్యేడు. తరతరాలుగా వస్తున్న తుపాకీని మాత్రం అలనాటి వైభవ చిహ్నంగా తాతలు చంపిన పులి తలల మీద అందంగా అమర్చారు.

రాజారావుకి కూడా వేటంటే సరదా. స్నేహితుల్తో తరచూ వేటకి వెళ్తూంటాడు. వెంట వైస్రాయిగారు వాడిన తుపాకీ ఉంటుంది. మరో తుపాకీ ముట్టుకోడం అతడి డిగ్నిటీకి లోపంగా భావించేవారు. రాజా వంశస్థులు పెద్దపులిని మాత్రమే వేటాడాలి – అనే గట్టి అభిజాత్యం కలవాడు. దేశం మొత్తంమీద పెద్ద పులుల సంఖ్య క్షీణించడంతో రామాపురం ఫారెస్టులో ఒక్క పులికూడా మిగలకుండా పోయింది. అందుచేత రాజారావు వేటకి పులులు కరువయ్యాయి. స్నేహితులతో వేటకి వెళ్ళినప్పుడు మిగతా జంతువులు కనబడితే ఆ ఛాన్స్‌ని వారికే వదిలేసేవాడు. స్నేహితుల చేత వేటాడించి ఆనందిస్తూ ఉండేవాడు. "రాజా! ఒక్కసారి మీరు మీ తుపాకీతో ఎగ్జిబిషన్ షాట్ కొడితే చూడాలని ఉంది" అని స్నేహితులు ప్రాధేయపడితే "నో, థేంక్స్! బలవంతం చెయ్యకండి. మా తాత ముత్తాతలు పులివేటలో గజవేటగాళ్ళు. నన్ను జింకల్ని దుప్పుల్ని కొట్టమంటారా?" అని సగౌరవంగా నచ్చజెప్పేవాడు. "ఈ జన్మకింతే. ఈ తుపాకీని పేల్చే అదృష్టం మరి నాకు లేదు" అని నిట్టూరుస్తున్నప్పుడు అతని ముఖంమీద విషాద ఛాయలు చూచాయగా కనిపించేవి.

ఒకరోజు అనుకోకుండా అకస్మాత్తుగా తన తుపాకీని పేల్చే అవకాశం లభించింది.

బంగళా గేటు ముందు రైతులు, వ్యవసాయ కూలీలు గుంపుగా చేరి గోల చేస్తున్నారు. రాజారావుని బైటకి రమ్మంటున్నారు. పేద రైతులకు పంచిన బంజరుభూముల్నీ, దేముడి మాన్యాల్నీ ఆక్రమించుకోడానికి ప్రయత్నం చేస్తున్న రాజారావుని ప్రతిఘటించడానికి వందల సంఖ్యలో రైతులు గుమిగూడేరు. ఏవేవో నినాదాలు చేస్తున్నారు.

రాజారావుకి తండ్రి జ్ఞాపకం వచ్చేడు. తనూ ఒక పదిమందిని కాల్చేద్దామనుకున్నాడు.

ఒక అంగలో వెళ్ళి పులి తలల మీద తుపాకీని అందుకున్నాడు.

"ఒద్దు బాబూ, ఈ దురితం తగదు. రోజులు మనవి కావు" అని నౌకరు రాజారావు చేతిలో తుపాకీని బలవంతంగా లాక్కున్నాడు. బయట తలుపులు మూశాడు.

రాజారావు బోనులో ఇరుక్కున్న సింహంలా పిచ్చెత్తినట్లు పచార్లు చేస్తున్నాడు. జుత్తు పీక్కున్నాడు. తుపాకీని చేతుల్లోకి తీసుకుని వలవల ఏడ్చాడు. "నావంటి చవట చేతిలో ఉండదగినదానవు కాదు. మా తండ్రిగారే ఉంటే ఈ పాటికి రక్తం ఏరులైపారేది."

బయట జనం గోల.

గేటు తోసుకొస్తున్నారు.

రాజారావు మరి ఉండలేకపోయేడు. పట్టరాని కోపంతో నౌకర్ని లెఖ్ఖ చెయ్యకుండా ప్రక్కకు నెట్టి తుపాకీ తీసుకుని గభాలున తలుపులు తెరుచుకుని బయటకు వచ్చేడు.

జనం గోల. "అన్యాయం, అక్రమం!" అరుపులతో గింగుర్లెత్తిపోతోంది.

"అడుగు ముందుకు పడిందా పిట్టల్లా రాలిపోతారు. నా చేతిలో ఏమిటుందో తెలుసుగా! కొన్ని సంవత్సరాల క్రితం దీనితో అరడజనుమందిని హరీ మనిపించేరు మా నాన్నగారు. నన్ను రెచ్చగొట్టొద్దు"

"కాలుస్తావా – కాల్చు" అని ముందుకొచ్చేడొకడు.

"నువ్వేకాదు చాలామంది రాలిపోతారు. జాగ్రత్త. అసలు మీకు కావలసిందేమిటి?"

"మాకు పంచిన బంజర్లని, దేవుడు భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారు. ఇదన్యాయం."

"ఆగండి, మీలో ఏ ఒక్కరో లోపలికి రండి, దాన్నిగురించి ఆలోచిద్దాం. అనవసరంగా రాద్ధాంతం చేసి రక్తపాతం చెయ్యకండి."

ముందున్న వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. "నేను వస్తాను పదండి" అన్నాడు లోపలికి వెళ్ళబోతూ.

"వద్దు చంపేస్తారు. లోపలికి వెళ్ళద్దు. అందరం వస్తాం."

"ఆ భయం మీకు అనవసరం. రాజకుటుంబంలో పుట్టినవాణ్ణి. అసహాయుల్ని చంపడం మా వంశంలో లేదు. మీకు అభయం ఇస్తున్నాను" అని రాజసం ఉట్టిపడుతున్నట్లు హుందాగా గదిలోకి వెళ్ళేడు. వెంటే వెళ్ళేడు రైతు కూడా.

'కూర్చో'మని ఎదురుగుండా కుర్చీ చూపించాడు.

రైతు అనుమానంగా చూస్తూ నిలబడే వున్నాడు.

"ఫరవాలేదు, కూర్చో" అని గంభీరంగా ఆజ్ఞాపించాడు.

రైతు కుర్చీలో కూర్చున్నాడు. ఇవతలవైపు రాజారావు కూర్చున్నాడు. వాళ్ళిద్దరి మధ్య తుపాకీ బల్లమీద ఉంది.

"ఇప్పుడు చెప్పు. ఏమిటి కావాలి? ఎందుకీ గోల?"

"మాకు పంచిన బంజరు భూముల్ని కలిపేసుకుంటున్నారు మీ జనం. కాదంటుంటే కలబడుతున్నారు."

"ప్చ్. దీని కోసమా ఇంత రాద్ధాంతం? బంజరు భూముల్నీ, సాక్షాత్తూ మా తాతలు ప్రతిష్టించిన దేముడు భూముల్నీ మేం కలిపేసుకుంటామటయ్యా? ఒకప్పుడు ఈ ఎస్టేటంతా మాది కాదూ! దీనిలో ప్రతీ గడ్డిపోచా మాది! మీకు వదిలేయలేదూ? ప్రజాసేవకి అంకితమైన మా కుటుంబం మీ అరముక్కా చెక్కా కలుపుకుంటుందా? ఒకవేళ అలా జరిగి ఉంటే అది మా వాళ్ళ పొరపాటు. మీది మీరు తీసుకోండి. సరా? – లేక నన్ను చంపితే గాని మీకు తృప్తి లేదా

– అదీ చెప్పండి. నా కంఠంలో ప్రాణం ఉండగా ఈ తుపాకీతో మిమ్మల్ని కాల్చి కాల్చి తరువాత నేలకొరిగి పోతాను. అరగంట వ్యవధి ఇచ్చేను. ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి. ఇక నువ్వు వెళ్ళచ్చు."

"అదేంటి బాబూ, ఉత్తి పుణ్యానికి మిమ్మల్నెందుకు చంపుతాం? మా కష్టాల్ని చెప్పుకుందామని వచ్చేంగాని చంపడానికి కాదే! ధర్మ ప్రభువులు, మీరు హామీ ఇచ్చారుకదా. వెళ్ళిపోతాం" అంటూ బయటకు వస్తూ "రాజారావు బాబూకీ జై", "రాజారావు బాబుకీ జై" అని దిక్కులు దద్దరిల్లేలా అరిచాడు.

జనంలో జయజయ ధ్వానాలు హోరెత్తిపోతున్నాయి.

రాజారావు రైఫిల్ పట్టుకున్న గౌతమ బుద్ధుడిలా ప్రశాంత వదనంతో తుపాకీతో బయటకు వచ్చి అందరూ నమస్కరిస్తుండగా చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేసి లోపలికి వెళ్ళి పోయేడు.

తుపాకీని గోడకి తగిలించాడు.

జనం వెళ్ళిపోతున్నారు.

అకస్మాత్తుగా రాజారావు ఇంత మంచి నిర్ణయం తీసుకున్నందుకు అర్థంకాక రాజారావు నౌఖరు తికమక పడిపోతున్నాడు.

రాజారావు సాలోచనగా సోఫాలో వాలి గదంతా కలయజూస్తున్నాడు.

తాత తండ్రుల తైలవర్ణ చిత్రాలమీద సాలీళ్ళు తిరుగుతున్నాయి. నిరుపయోగంగా వ్రేలాడుతున్న గాజు దీపాల గుత్తుల్లో కొడిగట్టిన క్రొవ్వొత్తుల అవశేషాలు మసగ్గా కనిపిస్తు న్నాయి. మాసిపోయి చివికిపోతున్న పులిచర్మాలు, ముడతలు దేరుతూ జీర్ణావస్థలో గోడలకి వేలాడుతున్న పెద్ద పులుల తలలు గత వైభవాన్ని వెక్కిరిస్తున్నాయి.

రాజారావు కిటికీలోంచి బైటకి చూశాడు.

దూరంగా పొలాల్లో దివాణం గుర్రం పచ్చగడ్డి కోసం వెతుక్కొంటోంది.

గోడకి వేలాడుతున్న తుపాకీని మరొక్కసారి చూశాడు. వైస్రాయిగారు వాడిన తుపాకి.

కిటికీలోంచి నీరెండ పడి సువర్ణాక్షరాలతో నగిషీలు చెక్కిన తుపాకి తళతళ మెరుస్తోంది.

ఒకనాడు ఎన్నో పులుల్ని, ఎందరో మనుష్యుల్ని హతమార్చి తరతరాల వైభవాన్ని నిలబెట్టిన తుపాకి.

ఆ తుపాకీని చూస్తూ బరువెక్కిన హృదయంతో కళ్ళు మూసుకున్నాడు.

అసలు విషయం ఒక్క రాజారావుకే తెలుసు!

ఆ తుపాకీ పేలదు.

*ఆంధ్రజ్యోతి వీక్లి: దీపావళి 1981*

కథా నిలయం
శ్రీకాకుళం